# 2057

అప్పుడే నిద్ర లేచిన వాడిలా కళ్లు తెరిచిన గోపాలం చుట్టూ చూశాడు. ఊరవతల ఉన్న పాడుబడిన భవంతది. సగం కూలిన గోడలు కన్పించాయి.

'తనిక్కడ ఎందుకున్నట్టు?' తల గోక్కుంటూ దిగ్గున లేచాడు.

తల దిమ్ముగా ఉంది. స్ట్రాంగ్‌గా టీ తాగాలన్పించింది ఒళ్ళు విరుచుకుంటూ ఊర్లోకి అడుగు పెడుతుంటే అంతా కొత్తగా వింతగా ఉంది. తనకేదో జరిగిందనుకున్నాడు.

కాసేపు బద్ధకంగా నడిచాక నరసంచారం కన్పించింది.

ఓ వ్యక్తినాపి "ఏ ఊరిది?" అనడిగాడు.

హై... దరా..బాద్" అతగాడి స్టయిల్‌కి పదం ముక్కలయ్యింది.

'తన ఊరే!' తల పంకిస్తూ ముందుకు కదిలాడు.

దాబా తగిలింది.

అందులో దూరి "స్ట్రాంగ్ టీ పట్రా" అంటూ సర్వర్‌కి అర్డరిచ్చాడు.

"వన్రూపీ చిల్లరుందా?" అడిగాడతను.

"టీకి ముందే టిప్పా?" తెల్లబోయాడు.

"టిప్పు కాదు. టీ రేటంత"

ఉలిక్కిపడ్డాడు.

'టీ అంత చవకయ్యిందా?' జేబులు తడిమి చూసుకున్నాడు.

'థ్యాంక్ గాడ్! చిల్లరుంది'.

'తరచూ నాయకులంటుంటారు. రామరాజ్యం తెస్తాం... రామరాజ్యం తెస్తామని. తస్సాదియ్యా! అదిగాని రాలేదు కదా?' అనుకుంటూ దాహం వేయడంతో తలతిప్పి అటూ ఇటూ వెతికాడు.

టీ తెచ్చిముందు పెడుతూ "ఏమైనా పోయిందా సార్?" సర్వరడిగాడు.

"వాటర్...వాటర్..." అన్నాడు గోపాలం.

"వా... వాటర్ పోయిందా?" ప్రశ్నించాడా సర్వర్.

"వాటర్ పోవడమేమిటి?" చిరాకు పడ్డాడు గోపాలం.

"ఈడికి మనం కొత్తా?" పరలోక వాసిని చూసినట్టు ఎగాదిగా చూశాడు.

"నీళ్ళయ్యా బాబూ! నీళ్లడిగితే ఏదేదో వాగేస్తున్నావేం?"

"సారీ సర్! స్ఫూనుడా? కప్పుడా!"

కోపం నషాళానికంటింది గోపాలానికి. ఉరిమి చూశాడతని వైపు.

అదేం పట్టించుకోకుండా "స్ఫూనుకి అయిదు. కప్పుకి ఇరవై. గ్లాసుకి యాభై". అంచెల వారిగా రేట్లు విడమరిచి చెప్పాడు సర్వర్.

"నీళ్ళనిలా అమ్ముతున్నారా?" పాలమారింది గోపాలానికి.

దాహం మాట మరిచి గబగబా టీ తాగేశాడు. రూపాయి బిళ్ళ కౌంటర్ దగ్గరప్పచెప్పి బయటపడ్డాడు.

ఖాళీగా వస్తోన్న ఆటోనాపి "వెస్ట్ మారేడుపల్లి. పోలీసు స్టేషన్ పక్కిల్లు. ఎంత?" అనడిగాడు.

"నేనిండ్ల బేరం చేయను సార్!" చాలా సిన్సియర్‌గా చెప్పాడు ఆటోవాలా.

"మరి అమ్మాయిల బ్రోకర్వా?" తిక్క రేగింది గోపాలానికి.

"ఇల్లు కాదేహే...ఆటో కిరాయి.." అన్నాడు తిరిగి.

అతను నాలిక్కర్చుకుంటూ "లోకల్ ఛార్జీ అయిద్రూపాయలు" అన్నాడు.

"అ... అయిదేనా?" గోపాలం బుర్ర గిర్రున తిరిగింది. దబ్బున కిందపడ్డాడు.

కంగారుపడిన ఆటోవాలా గభాల్న సీటుకిందున్న డబ్బా లాగి మూత తీసి గోపాలం మొహం మీద చిలకరించాడు.

శాప విమోచనమైన గంధర్వుడిలా గోపాలం లేచి నిలబడ్డాడు.

"మూర్ఛ ఉన్నవాళ్ళు మెడకి బోర్డు తగిలించుకోవాలి... " సానుభూతి వ్యక్తపరిచాడు ఆటోవాలా.

"అలాగయితే ఎందుకని వేసుకోలేదు. మొహం చూడు" రుసరుస లాడాడు గోపాలం.

"ఇంతకీ కిరాయి ఎంతన్నావ్?" క్లారిఫై చేసుకునేందుకు తిరిగి అడిగాడు.

"ఆర్రూపాయలు" ఎన్నిసార్లు చెప్పినా రేటొక్కటేనన్న స్టయిల్లో చెప్పాడు.

"మరిందాక అయిదన్నావ్!" పట్టేశా అన్నట్టు చూశాడు.

"ఇందాక మీ మొహం మీద చల్లిన పెట్రోల్ చుక్కలు కలుపుకుని చెప్పిన రేటన్న మాట" తాపీగా చెప్పాడా ఆటోవాలా.

అది విని 'వాక్!' మని డోక్కోబోయాడు.

"మొహం మీద పెట్రోల్ చల్లావా? ఇంకా నయం అగ్గిపుల్లొకటి గీయకపోయావా?" చిందులు తొక్కాడు. ఏమన్లేదతను.

గుర్రుగా చూస్తూ "కాసిని నీళ్ళే కరువయ్యాయా?" అరిచాడు బిగ్గరగా.

"అమ్మో నీళ్ళే?" కళ్ళు మిటకరించి "ఇప్పుడు ఇండియాలో పెట్రోలు బావులు పడ్తున్నాయి కాబట్టి లీటరు పెట్రోలు రూపాయి అయ్యింది. అదే నాలుగైదు చుక్కల నీళ్ళకి అయిదు రూపాయలు. నాకా తాహతు లేద్సార్" బేలగా అన్నాడు.

ఇందాకటి మూర్ఛ లక్షణాలు తిరిగి గోపాలం ఫేసుపై మొగ్గ తొడిగినట్టన్పించడంతో "ప్లీజ్ పడిపోకండి సార్! డబ్బాలో పెట్రోలు కూడా అయిపోయింది" మొత్తుకున్నాడు ఆటోవాలా.

అతడిని కరుణించిన వాడిలా కిందపడే ప్రోగ్రామ్ క్యాన్సిల్ చేసుకొని గోపాలం కామ్‌గా ఉండిపోయాడు. ఆటో బయల్దేరింది.

"కబుర్లేంటి?" అడిగాడు గోపాలం.

"నిన్న ఫస్ట్‌టైమ్ మా సంటోడు బట్టల్లో ఒంటేలుకు పోస్కోలేద్సార్?"

"ఏ... నువ్వు పోసుకున్నావా?" ఆటో ఆపి డొక్కలో ఒక్క తన్ను తన్నాలన్నంత మండింది.

కంట్రోలవుతూ "నేనడిగింది స్వ విషయం కాదు. సిటీ విషయం" అన్నాడు.

"పేపర్లో వచ్చింది. సిటీ పొలిమేరల్లో సంచరిస్తున్న అనుమానాస్పదమైన నలుగురు యువకుల్ని అరెస్ట్ చేసార్ట".

"నక్సలైట్లా?"

"అబ్బే వాళ్లిప్పుడెక్కడున్నార్సార్! అడవిలో నీళ్లు దొరక్క జన జీవన ప్రవంతిలో కలిసిపోయారేనాడో"

షాకయ్యాడు గోపాలం.

'నక్సలిజం లేదా? తనకు తెలీదా ఈ విషయం?' ఆశ్చర్యపోయాడు.

"మరి వాళ్లనెందుకు అరెస్ట్ చేసినట్టు?"

"జలనిధి కోసం ఓ కుర్రాడ్ని బలివ్వబోయార్ట"

"జలనిధా?" అదిరిపడ్డాడు గోపాలం.

"అవును. బోరింగ్‌లు వేయడం, బావుల్ని తవ్వడం ప్రభుత్వం నిషేధించిందిగా, అలా విడ్డూరపోతారేం?"

'తనకు తెలియకుండానే ఇవన్నీ ఎలా జరిగిపోతున్నాయ్? తనేమయ్యాడిన్ని రోజులు?' చప్పున ఏదో తట్టడంతో -

"అసలిదే సంవత్సరం?" అనడిగాడు ఉద్విగ్నుడై.

"2057"

అంతే ఈసారి మిస్సవలేదు గోపాలం. వెనక్కి విరుచుకు పడిపోయాడు.

గోపాలం ఆటో బేరమాడి నపుడు చెప్పిన అడ్రస్ గల ఇంట్లో అతగాడ్ని అప్పచెప్పి తుర్రుమన్నాడు ఆటోవాలా. "మంచిబేరమే తగిలిందిలే!" అని విసుక్కుంటూ.

* * *

2007లో ఆఫీసునుండొస్తున్న గోపాలాన్ని గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేశారు. వాళ్ళ బాదుడికి దెబ్బలు గట్టిగా తలకి తగిలి కోమాలో కెళ్ళాడు. అయితే వాళ్ళు కిడ్నాప్ చేయాల్సిన వ్యక్తి గోపాలం కాదని ఆలస్యంగా తెలిసి అతన్ని ఊరవతల బిల్డింగ్‌లో పడేసిపోయారు.

దయ్యాలు తిరుగుతున్నాయన్న నెపంతో అటు వైపెవరూరాని కారణాన అతని ఉనికి బయటపడలేదు.

తాను మిస్సయినపుడు కొడుకు యేడాది పిల్లాడు. వాడికి పెళ్ళయ్యిందిపుడు. ఇద్దరు పిల్లలు కూడాను. తన భార్యేమో ముసల్దయ్యింది. తను మాత్రం ఆనాటిలా.. ఇంకా యువకుడిలానే! అంతా కలలా... యన్.ఆర్.నంది సైన్స్‌ఫిక్షన్ నావెల్‌లా గమ్మత్తుగా తోస్తోందతనికి.

కుటుంబ సభ్యులంతా ఒకచోట చేరారు.

"తెగ దాహం వేస్తోంది. కాస్త మంచి నీళ్ళివ్వండి" గోపాలమడిగాడు.

తక్షణం కోడలు వెళ్ళి కప్పుతో వచ్చింది. అందులో స్ట్రా ఒకటి.

"వాటరడిగితే జ్యూస్ తెచ్చావేంటామ్మా?" కప్పు అందుకుంటూ అన్నాడు.

"జ్యూస్ కాదు. మంచినీళ్ళే మావయ్యగారూ!" అందామె వినయంగా.

"మ...మంచి నీళ్ళా?" నీళ్ళు నమిలాడు.

"మరీ స్ట్రా ఎందుకు?"

"దాహమైతే స్ట్రాతో పీల్చడమే. మునుపట్లా తాగడం కాదు. నాకూ అలవాటయ్యింది" భార్య చెప్పింది.

గోపాలం కళ్ళు బైర్లు కమ్మినయ్.

చేసేదేం లేక నీళ్ళు స్ట్రాతో పీల్చి సరిపెట్టుకున్నాడు.

"మరో కప్పుడు తేనా మావయ్యగారూ...."

అడుగుతోంది కోడలు.

'మరో డ్రమ్ముడు తేనా....' అన్నట్టు వినపడిందతనికి.

"వద్దులే" అన్నాడు నీర్సంగా.

"అకటా... తాగునీటికెంత కట... కట..."

బోల్డు వాపోయాడు.

"వర్షాలు పడడం లేదా?" అడిగాడు గోపాలం.

"పడడం లేదు. గెంతుతున్నాయ్!" వ్యంగ్యంగా అంది భార్య.

"వర్షాకాలం..."

"ఇంకెక్కడి వర్షాకాలం. భూతలం మీద వాతావరణ కాలుష్యం పెరిగి 'ఓజోన్ పొర' చిరిగింది. పడ్డాయో... అవి ఆమ్లవర్షాలే!" అన్నాడు కొడుకు.

మనవడూ, మనవరాలిని చూస్తూ "మీకు వర్షాలంటే తెలుసునా?" అడిగాడు గోపాలం.

"వర్షాలంటే ఏంటని అడిగితే మీ కాలపు సినిమా వానపాటల సి.డీలు తెచ్చి చూపాను. అదీ నాన్నా పరిస్థితి. నేటి నీటి దుస్థితి" కొడుకే బదులిచ్చాడు.

తాను యాభై సంవత్సరాల కాలం కోమాలో ఉండిపోవడమే వందరను కుంటుంటే ఈ నీటి వెతలు విభ్రాంతికి గురి చేస్తున్నాయతన్ని.

"ఆకలిగా ఉంది. భోంచేశాక తీరిగ్గా మాట్లాడుకుందాం గానీ, సువర్ణా! స్నానం చేస్తాను. కాస్త వేన్నీళ్ళు పెట్టు" అన్నాడు గోపాలం భార్యతో.

ఘొల్లుమన్నారంతా.

"ఎవరైనా జోకేసారా? స్నానం చేయాలన్న మూడ్‌లో విన్లేదు. చెబితే నేనూ నవ్వుతో కోరస్ అవుతాగా" గోపాలమన్నాడు.

తాతయ్యా! మీరు స్నానానికి నీళ్ళడిగారు చూడండి. అందుకు నవ్వొచ్చింది మాకు" నవ్వాపి చెప్పింది మనవరాలు.

"దీన్లో నవ్వడానికేముంది?" నొసలు చిట్లించాడు.

"ప్రతి సండే ప్రభుత్వ వాటర్ డిపోలో ఫ్యామిలీ కార్డ్ చూపిస్తే వాటరిస్తారు. మంత్లీ బిల్లొస్తుంది. ఆ ఒక్కరోజే స్నానం. ఈ రోజు మండే. సో వారం దాకా ఆగాల్సిందే" ఈసారి మనవడు కలుగజేసుకున్నాడు.

పెంబట్ల-కోనాపూర్ దుబ్బ రాజేషుని జాతరలో దేవుడు పూనినవాడిలా కుర్చీలో విరుచుకుపడి పోయాడు గోపాలం.

* * *

పత్తా లేకుండా పోయిన గోపాలం తిరిగొచ్చాడని తెల్సిన మిత్రబృందం ఇంట్లో వాలారు. వాళ్లంతా ముసలోళ్లయిపోయారు. పిచ్చాపాటి కబుర్లలో పడ్డారు.

"ఈవినింగ్ వాటర్ పార్టీ అరెంజ్ చేస్తున్నాం. నువ్వు షేర్ చేసుకోవాల్రా" ఓ ఫ్రెండ్ ప్రపోజ్ చేశాడు.

"అబ్బా! బీరు బోరు. ఏదైనా వెరయిటీగా అరెంజ్ చేయొచ్చుగా. మందు పార్టీకి బదులు" గోపాలమన్నాడు.

"మందు పార్టీ ఎవరన్నార్రా? మందయితే ఎవడింట్లో వాడు మస్తుగా కొట్టి హాయిగా తొంగుంటాడు"

పకపకా నవ్వారంతా.

"ఎందుకా... ఇక ఇకలు" గోపాలానికి అర్ధమవలేదు.

"ఇప్పుడంతటా మినరల్ వాటర్ పార్టీలే. ఈ కాలంలో మినరల్ వాటర్ పార్టీ అంటే మోస్ట్ కాస్ట్లీ అండ్ హైక్లాస్ పార్టీ అన్నమాట" మరో ఫ్రెండ్ బదులిచ్చాడు.

గోపాలం వెర్రి చూపుల గోపాలుడయ్యాడు.

* * *

వర్షాలు లేకపోవడం, వాటర్‌కి తీవ్ర సంక్షోభం ఏర్పడటం గురించి తీవ్రంగా స్పందించాడు గోపాలం. రోజుల తరబడి మూలాలు శోధించాడు.

'నేను సైతం ...' అంటూ ఓ ప్లానేశాడు రొటీన్ స్టయిల్‌లో.

ఓ మంచి రోజ్జూసుకుని నడుం బిగించాడు.

బిజీగా ఉండే సెంటర్ సెలెక్ట్ చేసుకొని పెద్ద టవరెక్కాడు. 'దూకేస్తానంటూ అరిచాడు. అందరి దృష్టి పడింది. సెకన్లో జనం పోగయ్యారు.

న్యూస్ స్ప్రెడయ్యింది. ప్రెస్ కదిలొచ్చింది. పోలీసు యంత్రాంగం మాటేసింది.

"ఎందుకీ పైత్యం..." ఆ ఏరియా సి.ఐ విసుక్కున్నాడు కింది నుండి.

"అలాగయితే దూకుతూ!" బెదిరించాడు.

"డాడీ! ఇందాకట్నుండి ఆ అంకుల్ దూకుతా! దూకుతానంటాడే గానీ దూకడేం?" తండ్రితో సహా ఆ తమాషాని కుతూహలంగా తిలకిస్తున్న ఓ కుర్రాడడిగాడు ఉత్సుకతతో.

అంతెత్తు నుండి దూకితే కళ్ళారా చూడాలని యమ సరదాగా ఉంది వాడికి. టీవీల్లో తప్ప ఇలాంటివి నిఝంగా చూళ్లేదని వాడి క్యూరియాసిటీ.

"అంత తొందరపడితే ఎలా? అంకుల్ అదే పనిలో ఉన్నారుగా" సర్ది చెప్పాడు తండ్రి.

మళ్ళీ వాడు నోరు తెరవబోతుంటే "నువ్వయితే బిగ్గరగా అరవకు. అంకుల్ ఫీలై దూకకుండా ఉండిపోతారని" తండ్రి అడ్డుపడితే చప్పున నోర్మూసాడు వాడు.

"నీ డిమాండేంటీ?" సి.ఐ అడుగుతున్నాడు బిగ్గరగా.

"డిమాండేం కాదు. స్మాల్ రిక్వెస్ట్..."

నిశ్శబ్దమై పోయింది కింద. అతను చెప్పేదేంటో వినాలని.

"ఒక్క నీటిచుక్క కోసం మానవజాతి తహతహలాడిపోతోంది. ఎందుకు? ప్లీజ్! క్షణం ఆలోచించండి. కావాలని మనమే ఈ విపత్తును కొని తెచ్చుకుంటున్నామన్న వాస్తవం తెల్సుకోండి.

అశోకుడు చెట్లు నాటించాడు. బావులు తవ్వించాడు. ఎందుకని? నీటి కోసం. మరి మనమేం చేస్తున్నాం. చెట్లని నరికేస్తున్నాం. వర్షాలకు బ్రేకేస్తున్నాం. నీరు నిలువ కాకుండా చెరువుల్ని సైతం రియల్ ఎస్టేట్లుగా మార్చి క్యాష్ చేసుకుంటున్నాం. నేలంతా కాంక్రీటద్దుకుంటోంది. భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి.

ఇదిలాగే కొనసాగితే...

అపుడో ఇపుడో మనకంటపడుతున్న నీటి చుక్క కనీసం పై తరాలకందుతుందా? అలాగైతే భూగ్రహం జీవరహితమై మిగతా గ్రహాల్లా మిగిలిపోతుంది.

అందుకే జల విప్లవం రావాలి. జల విపత్తు నెదుర్కొనే మార్గాలన్వేషించాలి. నీటి వనరుల్ని పెంచుకునే దిశగా ఆలోచనలు సాగాలి.

'జలో రక్షతి రక్షితః' చెప్పాలనుకున్నది గడ... గడా చెప్పి ఆయాసంతో ఆగిపోయాడు.

జనంలో కలకలం రేగింది.

గోపాలం ప్రతిపాదనకు పెద్దపెట్టున జయజయధ్వానాలు మిన్నుముట్టాయి.

వారి స్పందనకి గోపాలం ఉక్కిరిబిక్కిరయ్యాడు. టీవీలో టెలికాస్టవుతోందిదంతా లైవ్‌గా.

'అంకుల్ ఇక దూకడని' డిసైడయ్యాక తండ్రితో నిరాశగా వెనుదిరిగాడిందాకటి కుర్రాడు.

కానీ ఆ కుర్రాడికి తెలీదు....

గోపాలం నేల జారాడని!

కలలో కలవరిస్తూ... నిద్రలోనే పలవరిస్తూ ... దొర్లుతూ దొర్లుతూ...పాపం మంచం మీద నుండి దబ్బున కిందపడ్డాడని.

హతోస్మి!

అతడి తలకి బలంగా దెబ్బ తగిలింది.

గోపాలం నిజానికిపుడు కో...మా..లో...కి...

దీపావళి హాస్యకథల పోటీలో ఎంపికైన కథ

(జనవరి, 2008)

❖